స్పీడుకు బ్రేకులేవీ..?

- ఆకతాయిల విన్యాసాలతో అవస్థలు
- ప్రమాదాలతో జనం ఆస్పత్రిపాలు
- ఇబ్బంది పడుతున్న స్కూల్, కాలేజీ విద్యార్థులు

వేగంగా ప్రయాణిస్తున్న వాహనాలు

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

చిత్తూరు –తిరుపతి కడప ప్రధాన రహదారి పైన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పెనుమూరు క్రాస్ నుంచి కట్టమంచి వరకు సుమారు 7 కిలోమీటర్ల మేర స్పీడు బ్రేకర్లు లేవు. పెనుమూరు క్రాస్ వద్ద ఎస్‌వి సెట్ కళాశాల విద్యార్థులు ద్విచక్ర వాహనాలు, కాలేజీ బస్సులతోపాటు తిరుపతి, కడప, హైదరాబాద్, మొదలైన ఊర్లకు వెళ్లే బస్సులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఆ క్రాస్ వద్ద స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయని కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. మురుకంబట్టు ఇది ప్రధాన కూడలిగా తయారైంది. తమిళనాడు, కర్ణాటకు వాహనాలు, బస్సులు, ఈ బైపాస్ గుండానే వెళుతుంటారు. దీనికి తోడు అక్కడే అపోలో యూనివర్సిటీ, సీతమ్స్ కళాశాల, అగ్రహారం మొదలైన గ్రామాలకు వెళ్ళేటటువంటి దారులకు ఇదే ప్రధానమైన కూడలిగా ఉంది. ఈ కూడలి వద్ద స్కూల్ బస్సులు, విద్యార్థుల బైకులు, స్థానికుల వాహనాలు, వ్యాపారస్తుల వాహనాలతో రద్దీగా ఉండేటటువంటి కూడలి.

ఈ కూడలి వద్ద ఎలాంటి స్పీడు బ్రేకర్లు లేని కారణంగా విద్యార్థులు, కొందరు ఆకతాయిలు బైకుల పైన స్పీడ్‌గా డ్రైవ్ చేస్తూ విన్యాసాలు చేస్తూ తోటి వాహనదారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా తోటి ప్రయాణికులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు.. ఆకతాయిల వలన పలుమార్లు స్థానికులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇక్కడ స్పీడ్ బ్రేకరు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు కోరుతున్నారు. అలాగే దొడ్డిపల్లి, కట్టమంచి దగ్గర ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. వాహనాలు నిత్యం అత్యంత రద్దీగా ఉండేటటువంటి ప్రాంతంలో యువకులు మితిమీరను స్పీడుతో వాహనాలు నడిపి నిండు ప్రాణాలను కోల్పోతున్నారు. గతంలో ఈ కూడల వద్ద అతివేగం కారణంగా అనేకమంది యువకులు, స్థానికులు ప్రాణాలు పోగొట్టుకొని కుటుంబ సభ్యులను శోకసముద్రంలో ముంచారు. ప్రధానంగా దొడ్డిపల్లి – కట్టమంచి వద్ద అనేకమంది స్పీడ్ బ్రేకర్లు లేని కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేసి యువతను ప్రమాదాల భారినుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీ దృష్టికి

చిత్తూరు సమస్యలు

చిత్తూరు నియోజవర్గ సమస్యలు ముఖ్యమంత్రి తెలియజేస్తున్న ఎంఎల్‌ఏ గురజాల. అసెంబ్లీలో ప్రసగిస్తూ..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్:

చాలా ఏళ్ల తరువాత రాష్ట్ర అసెంబ్లీలో చిత్తూరు నియోజవర్గ సమస్యలపై చర్చ నడిచింది. చిత్తూరు నియోజవర్గం సమస్యలను ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ అసెంబ్లీ ముందు ఉంచారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం లేకున్నా మొదటిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర మొదటి అసెంబ్లీలోనే తనదైన శైలిలో సభ దృష్టికి తీసుకొచ్చారు. సున్నితంగానే నగర అభివృద్ధి, తాగునీటి కోసం నీటి కేటాయింపులు, యూనివర్శిటీ ఏర్పాటుపై ఎంఎల్‌ఏ ప్రసంగాన్ని నియోజకవర్గ ప్రజలు హర్షిస్తున్నారు.

దశాబ్దాల కాలంగా చిత్తూరు వాసుల సమస్యలపై ఎంఎల్‌ఏ గళం విప్పడం.. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు స్పందించి నిధులు మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం చిత్తూరుకు మంచి రోజులు రాబోతున్నాయ్ అని చిత్తూరు నగర వాసుల్లో చర్చ నడుస్తోంది. చిత్తూరు నగరంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు ప్రజల ఆకాంక్షలు నెరవేరే దిశగా అడుగులు పడ్డాయి. ఉన్నత చదువుల, ఉద్యోగాల కోసం చిత్తూరు నిరుద్యోగులు బెంగుళూరు, చెన్నై వైపులు పెరుగులు పెడుతున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో పేరుకే జిల్లా కేంద్రం అయినా ఇక్కడ ఒక్క యూనివర్శిటీ కూడా లేదు. అభివృద్ధి అంతంత మాత్రమే జిల్లా విభజన తరువాత యూనివర్శిటీ ఏర్పాటు చేయాలంటూ మేధావులు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి. అసెంబ్లీలో యూనివర్శిటీ ఏర్పాటును లేవనెత్తారు. ప్రభుత్వపెద్దలు సానుకూలంగా స్పందించారు.

అలాగే చిత్తూరు తాగునీటికి శాశ్వత పరిష్కారంగా అడవిపల్లి రిజర్వాయర్ నుండి నీటి తరలింపు పనులు పెడింగ్‌లో ఉన్నాయి. ఈ అంశాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకురావడంతో 786 టీఎంసీలు నీటికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వుల జారీ చేసింది. నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ కేంద్రం ఏర్పాటు, గుడిపాల పిహెచ్‌సి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా అప్‌గ్రేడ్, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి అధునాతన అంబులెన్స్, అడవిపల్లి నుంచి చిత్తూరుకు నీటి తరలింపు పైపులైన్ పెండింగ్ పనుల పూర్తి కోసం రూ.70 కోట్లు కేటాయింపు, చిత్తూరు కార్పొరేషన్ సుందరీకరణ, అభివృద్ధి పనుల కోసం రూ.350 కోట్లు కేటాయించాలని చిత్తూరు ఎంఎల్‌ఏ గురజాల జగన్‌మోహన్ తొలి అసెంబ్లీ సమావేశాల్లో చిత్తూరు నగరవాసుల కష్టాలు, కోరికలు అసెంబ్లీ ముందు ఉంచారు.

అడవిపల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న గురజాల (ఫైల్‌ఫోటో)

తీరనున్న నగర వాసులు కష్టాలు

- ఎస్ఆర్. సత్యనారాయణ, చిత్తూరు స్మార్ట్‌సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ, ఉపాధ్యక్షులు

చిత్తూరు అభివృద్ధిపై అసెంబ్లీలో చర్చ నడవడం అభినందనీయం గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఎంఎల్‌ఏ గురుజాల జగన్ మోహన్ చిత్తూరు నియోజవర్గ సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించడంతో పాటు నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై చిత్తూరు నగర వాసులు తాగునీరు, యూనివర్శటీ ఏర్పాటు, కొత్త పరిశ్రమలు, రోడ్ల విస్తర్ణ జరుగుతాయని ఆశిస్తున్నాం. ఎంఎల్‌ఏ కృషి అభినందనీయం.

26న ధర్నాను జయప్రదం చేయండి

సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రైతులు కార్మికులు, స్కీమ్ వర్కర్లు, ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈనెల 26వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్నట్లు ధర్నాను విజయవంతం చేయాలని ట్రేడ్ యూనియన్ ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎస్టీయు కార్యాలయంలో ట్రేడ్ యూనియన్, ప్రజాసంఘాల నాయకులు సమావేశం దాసరి చంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజీవరం సురేంద్రన్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఎన్.సురేంద్రనాథ్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం కేంద్రంలో మోడీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీల పెంపు, నిత్యావసరాల ధరల పెంపుతో సామాన్య మధ్యతరగతి ప్రజలకు కష్టాలు తప్పడం లేదన్నారు. గిట్టుబాటు ధర లేక రైతులు, కార్మిక వ్యతిరేక విధానలతో వర్కర్లు అవస్థలు పడుతున్నారని అన్నారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు ఐక్యపోరాటంలో భాగంగా ఈనెల 26వ తేదీ చిత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో రైతులు, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా, మురళి, కెవిపిఎస్ నాయకులు ఈశ్వర్, ఏఐటియుసి నాయకులు గోపినాథ్, మంజునాథ్ బాబు, రామ్మూర్తి, మణి, రమాదేవి, మహిళా సమైక్య విజయగౌరవి, కుమారి పాల్గొన్నారు.

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు శివకుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: 108 ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో యూనియన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. శనివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో 108 ఉద్యోగుల సమస్యలపై ట్రేడ్ యూనియన్ ప్రజాసంఘాల నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, జిల్లా అధ్యక్షులు గిరిధర గుప్తా, ఉపాధ్యక్షులు గంగరాజు ఏఐటీయూసీ నాయకులు చంద్ర, ఐఎఫ్‌టియు నాయకులు సురేంద్రనాథ్, దళిత సంఘాల నాయకులు మునస్వామి, హ్యూమన్ రైట్స్ కుమరేష్ పాల్గొని మాట్లాడారు. అత్యవసర సేవలు అందించే 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. 108 ఉద్యోగుల పోరాటానికి ట్రేడ్ యూనియన్లు ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో 108 యూనియన్ జిల్లా అధ్యక్షులు శివ, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి జ్ఞానసేకరన్, రసూల్, మహిళ అధ్యక్షులు కోమల, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్ ఫీజు వసూలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరపాలక పరిధిలో ఆదివారం నుండి మార్కెట్ ఫీజు, ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఫీజు వసూలు నగరపాలక అధికారులచే చేపట్టనున్నట్లు నగర కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ తెలిపారు. 2024–25 సంవత్సరానికి సంబంధించి మార్కెట్ ఫీజు, పార్కింగ్ ఫీజు టెండరుదారులు డబ్బులు చెల్లించనందున.. సదరు టెండరు రద్దు చేసి.. నగరపాలక సంస్థ అధికారులచే ఆదివారం నుండి ఫీజులు వసూలు చేపట్టనున్నట్లు తెలిపారు. నగరపాలక పరిధిలోని కూరగాయల మార్కెట్లు, జంతు వధ శాలలు, ఎన్టీఆర్ బస్టాండ్, పాత బస్టాండ్, నగరంలోని మిగిలిన ప్రాంతాల్లో మార్కెట్లు, ప్రైవేటు బస్సుల పార్కింగ్ ఫీజులు వసూలు చేపట్టడానికి నగరపాలక అధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారులు, ఆర్ఐలు, కేటాయించబడిన అడ్మిన్ కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి ఫీజులు వసూలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు.

విద్యుత్ ఒప్పందాలు రద్దు చేయాలి

అదానీని అరెస్టు చేయాలి.. సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సెకీ నుంచి రాష్ట్ర డిస్కంలు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదానీ గ్రూపు భారీ ముడుపులు చెల్లించిన నేపథ్యంలో రాష్ట్రంలో అదానీ గ్రూపు కంపెనీ చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని, అదానీని వెంటనే అరెస్టు చేయాలని శనివారం చిత్తూరు హైరోడ్డు సర్కిల్‌లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ 2019–20 మధ్య సెకీ ఒప్పందమే గాక రాష్ట్రంలో పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, విశాఖలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులను అదానీ గ్రూపు సంస్థలతో నాటి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకుని ప్రభుత్వ ఆస్తులను, ప్రజల సంపదను వారికి ధారాదత్తం చేసిందని విమర్శించారు. అదానీ గ్రూపు అక్రమాలను ప్రతి ఒక్కరు ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన ప్రదర్శనల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు. అదానీ గ్రూపుతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలన్నింటినీ రద్దు చేసుకోవాలని, వారికి కేటాయించిన భూముల్ని, ప్రజల సంపదను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ డేటా సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని, లంచాలు తీసుకున్న అవినీతిపరుల పేర్లు, వివరాలను అమెరికా ప్రభుత్వం నుండి పొందడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా దౌత్యపరమైన చర్యలు వెంటనే చేపట్టాలని, అమెరికా న్యాయస్థానాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా అదానిపై కేసు నమోదు చేయడంతోపాటు వెంటనే కేసు నమోదు చేసేట్లు సిబిఐని ఆదేశించాలన్నారు. అదానీ గ్రూపు అక్రమాలను వెలికితీసేందుకు స్వతంత్ర సంస్థతో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. సిపిఎం మొదటి నుంచి దేశంలో ఉన్న కార్పొరేట్ సంస్థ అదానే తన వ్యతిరేకిస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం అదానిలకు అప్పగిస్తున్నదని, ప్రజలపై భారాలు మోపుతూ కార్పొటు శక్తులకు దేశ సంపదను అప్పనంగా ఇస్తోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ప్రజలు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సురేంద్రన్, గిరిధర్ గుప్తా, నాయకులు మురళి, ఈశ్వరయ్య, దాసు, ఆనంద్, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాఠశాలలో విద్యార్థులకు అసెస్మెంట్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండలస్థాయిలో ఎంఈఓలు, తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు ఈకార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహణపై జిల్లా కలెక్టర్ శనివారం జిల్లా సచివాలయం నుండి డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపిసి వెంకట రమణా రెడ్డి, బిసి వెల్ఫేర్ డిడి రాజ్యలక్ష్మిలతో కలసి మున్సిపల్ కమిషనర్లు, ఎంఈఓలు, తహశీల్దార్లు, ఎంపిడిఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పన జరుగుతోందని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేలా మెరుగైన బోధన విధానం ఉండాలని తెలిపారు. బోధన విధానం పర్యవేక్షణలో విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, హాస్టల్ విద్యార్థికి అసెస్మెంట్ కార్డులు ప్రభుత్వం ద్వారా అందుతుందని, ఈకార్యక్రమానికి తల్లిదండ్రులను పాఠశాలలకు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి కార్డులను అందించాలన్నారు. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయికి కార్డుల పంపిణీ ఉంటుందని, పాఠశాలలకు కార్డులు అందిన తరువాత విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు కార్డుపై నమోదు చేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణ ఏర్పాట్లు పాఠశాల స్థాయిలో హెచ్‌ఎంలు బాధ్యత తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు విద్యార్థుల అసెస్మెంట్ కార్డులపై ప్రభుత్వ రాజముద్ర తప్ప మరే ఫోటో ముద్రించబడదన్నారు. ఆహ్వానించాలని పాఠశాలలో విద్యావిధానం, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం విధానం, తాగునీరు, పారిశుధ్యం, రక్తహీనత, తదితర సమస్యలను అడిగి తెలుకోవాలని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అభిప్రాయ సేకరణ చేసి సమస్యలను ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని, ఎంఈఓలతో పాటు తహశీల్దార్, ఎంపిడిఓలు కూడా పాల్గొనాలని, సచివాలయ సిబ్బందిని కూడా భాగస్వామ్యం చేయాలన్నారు.

అసెంబ్లీలో ప్రజాగళం

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో చిత్తూరు జిల్లా సమస్యలు ప్రధానచర్చగా నిలిచాయి. జిల్లాకు చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు తమతమ నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు. వారివారి నియోజకవర్గాల అభివృద్ధికోసం నిధులు కేటాయించాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే నగరప్రజల దాహార్తి తీర్చడానికి అడవిపల్లి రిజర్వాయర్ నుంచి ఎన్‌టిఆర్ జలాశయానికి నీటి కేటాయింపు, అసంపూర్ణంగా ఉన్న తాగునీటి పైపులైను ఏర్పాటుకు నిధులు, నగర అభివృద్ధికి నిధులకు సంబంధించిన నియోజకవర్గం సమస్యలను అసెంబ్లీ దృష్టికి తీసుకొచ్చారు.

జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో వసతులు, రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, నిరుద్యోగ యువతకు ఉపాధి కోసం జీడి నెల్లూరులో పరిశ్రముల ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ వేలూరు సిఎంసిలో ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని, పలమనేరు– చిత్తూరు, తిరుపతి– నాయుడుపేట జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలు, రోజువారీ కూలీలను ఉపాధి హామీలో చేర్చు, జనరిక్ మందులు ప్రతి మండలంలో ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డి నియోజవర్గంలో ఎక్కువగా అటవీ ప్రాంతం నుంచి ఏనుగులు గ్రామాల్లోకి వచ్చిన పంట, ప్రాణ నష్టం కలిగిస్తున్నాయని, రైతులు, గ్రామస్తులు ఏనుగల దాడుల్లో చనిపోతున్నారని తెలిపారు. ఏనుగుల గ్రామాల్లోకి రాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని, కుంకీ ఏనుగులను తీసుకురావాలని, రైతు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. అలాగే ఆయా నియోజవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. అలాగే నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ సైతం తమ నియోజకవర్గంలోని పవర్‌ల్యూమ్ కార్మికులు, ఇతర నియోజకవర్గ సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పారు. తమతమ నియోజకవర్గాలను అభివృద్ధిపథంలో నడిపించుకోవడానికి ఎమ్మెల్యే నిధులు కావాలని కోరడం శుభపరిణామం. ఇది అలా ఉంచితే.. మరోవైపు ఎన్నిక సందర్భంగా ఇచ్చిన హామీల అమలు కోరుతూ అంగన్వాడీలు, ఆశాలు 104, 108 సిబ్బంది ఆందోళన బాట పట్టారు. 108 అంబులెన్స్ సేవలను కొనసాగించేలా థార్డ్‌పార్టీ ఏజేన్సీ రద్దు చేసి ప్రభుత్వమే నిర్వహించేలా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రజాగళం పేరిట సిపిఎం క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలపై తహాశీల్దార్, కలెక్టర్లకు వినతిపత్రాలు అందించారు. ప్రజాసమస్యలపై రాష్ట్ర అసెంబ్లీ, క్షేత్రస్థాయిలో మండల, జిల్లా కేంద్రాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు పెరుగుతున్నాయి. తమ సమస్యలపై ప్రశ్నించేందుకు ప్రజలు ఉద్యోమాలు నిరసన కార్యక్రమాల్లోకి వస్తున్నారు. ప్రజల్లో ప్రశ్నించేతత్వం పెరుగుతోంది.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

పోలీస్ స్టేషన్లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : బైరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మణికంఠ చందోలు శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు స్టేషన్ నిర్వహణ, పరిశస ప్రాంతాలు, సిబ్బంది పని తీరు, విధులు, ముఖ్యమైన కేసుల దర్యాప్తు, స్టేషన్‌లో నిర్వహిస్తున్న కేసు డైరీ, విలేజ్ రోస్టర్, వివిధ క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు స్టేషన్ పరిధిలో తీసుకున్న చర్యలను సమీక్షించారు. బ్లాక్ స్పాట్స్ దగ్గర రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకున్న చర్యలను సమీక్షించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి. హత్యలు, హత్యాయత్నాలు, క్రైమ్ ఎగైనెస్ట్ ఉమన్, గర్ల్ మిస్సింగ్, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, 174సి ఆర్‌పిసి తదితర కేసుల రికార్డ్స్ ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై కేసుల ఫైల్స్ ను క్షుణ్ణంగా పరిశీలించి నిందితులు అరెస్ట్ కాని కేసులలో నిందితులను త్వరగా అరెస్ట్ చేయాలని ఆదేశించారు. మహిళా పోలీసులు ఇంటింటికి వెళ్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, మ్యాట్రిమోనియల్ ఇష్యూస్, సైబర్ నేరాలు, లోన్ యాప్‌ల మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఫోక్సో నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే డ్రంకన్ డ్రైవ్, రోడ్డు భద్రతా నియమాలపై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఎస్పీ తెలిపారు. పలమనేరు డీఎస్పి ప్రభాకర్, పలమనేరు రూరల్ ఇన్స్పెక్టర్ మురళి మోహన్, బైరెడ్డిపల్లి ఎస్ఐ పరశురాముడు, సిబ్బంది పాల్గొన్నారు.

26న జిల్లా స్థాయి 'యువ ఉత్సవ్'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఈనెల 26వ తేదీన చిత్తూరు ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జిల్లా సచివాలయంలోని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాస్థాయి యువ ఉత్సవ్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరితో కలసి ఆవిష్కరించారు. భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా నెహ్రూ యువ కేంద్రాల ద్వారా యువ ఉత్సవాలను నిర్వహించనున్నదని, ఇందులో భాగంగా ఈనెల 26వ తేదీన చిత్తూరు ఎస్‌వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాస్థాయి యువఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన, కవిత్వం, ఫోటోగ్రఫీ, సైన్స్ మేళా, వకృత్వ పోటీలు, నాట్య పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. 15 నుండి 29 సంవత్సరాల లోపు ఔత్సాహికులు తమకు నచ్చిన పోటీలలో పాల్గొన వచ్చునని తెలిపారు. ఇతర వివరాల కోసం 99081 27829 నంబరును సంప్రదించవచ్చునని నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ తెలిపారు.

అస్వస్థతకు గురైన విద్యార్థినులు

ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం అగరంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన పరుగు పందెంలో పాల్గొన్న ఐదుగురు విద్యార్థినులు శ్వాసఅందక అస్వస్థతకు గురి అయ్యారు. తల్లిదండ్రులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం చైల్డ్ కేర్ వార్డులో చికిత్స పొందుతున్నారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

రూ.4.70కోట్లు ఎంపి నిధులతో

పల్లెల్లో సిసి రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ ఆశించిన గ్రామస్వరాజ్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే.. కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. పార్లమెంట్ సమావేశాలకు హాజరైయ్యేందుకు ఢిల్లీ వెళ్ళిన చిత్తూరు ఎంపీ పల్లె ప్రాంతాల ప్రగతి కోసం చిత్తశు ద్ధితో పని చేస్తున్న కూటమి ప్రభుత్వ కృషిని కొనియాడారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేయడంతో పాటు, గ్రామ పంచాయతీలకు పూర్వవైభవం తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సందర్భంగా చిత్తూరు పార్లమెంటు పరిధిలో ఎన్నో గ్రామాలను తాను సందర్శించానని గ్రామీణ ప్రాంతాలలో రహదారుల దుస్థితిని గుర్తించినట్లు చెప్పారు. గుంతలమయమైన రోడ్లను బాగు చేసేందుకు సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఇందుకోసం రూ.4.70 కోట్ల ఎంపీ నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే చిత్తూరు పార్లమెంటు పరిధిలోని కొన్ని గ్రామీణ ప్రాంతాలలో సిసి రోడ్ల నిర్మాణం పూర్తికాగా మరికొన్ని నిర్మాణ దశలోనూ, ప్రారంభ దశలోనూ ఉన్నాయన్నని పేర్కొన్నారు. ఈ సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయితే పల్లె ప్రాంతాల రూపురేఖలు మారతాయని, తద్వారా గ్రామీణ ప్రాంతాలు పురోభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం నిధులతో సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో చిత్తూరు పార్లమెంటును అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ప్రజలు తన మీద పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము కానేవ్వకుండా తన కర్తవ్యాన్ని చిత్తశు ద్ధితో నిర్వర్తిస్తానని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలియజేశారు.

యాంత్రీకరణతో అధిక లాభాలు

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఎకరాకు 35బస్తాలు దిగుబడి

ప్రజాశక్తి-విజయపురం

ఆధునాతన పద్ధతుల్లో రైతులు సాగు చేసుందుకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ అధికారులు నడుం బిగించారు. తక్కువ సమయంలో స్వల్ప పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించేందుకు రైతులకు దారి చూపిస్తున్నారు. ఈ సందర్భంగా మండలంలో సీఎస్‌కండ్రిగ, పన్నూరు, మాధవరం, బూచివానత్తం, గంగమాంబపురం తదితర గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి కూలీలతో పని లేకుండా యాంత్రీకరణ ద్వారా వేరుశెనగ విత్తనం సాగు చేసే పద్ధతిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. వేరుశెనగ విత్తన గొర్రు ద్వారా సాగు చేస్తే ఎకరాకు 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అంతే కాకుండ కూలీల అవసరం ఉండదు.

కూలీలతో పని లేదు

వేరుశెనగ విత్తన గొర్రుతో సాగు చేసేందుకు ఎకరాకు 90 కేజీల విత్తనం సరిపోతుంది. అలాగే విత్తనాన్ని గొర్రులతో వేయడం ద్వారా విత్తనం మధ్య దూరం పెరిగి దిగుబడి పెరుగుతుంది. కూలీల అవసరం ఉండదు. సాధారణ పద్దతిలో వేరుశెనగ విత్తనం నాటడానికి ఎకరాకు ముగ్గురు కూలీలు, రెండు మడకలు అవసరం. దీనికి సుమారు 2500 ఖర్చు అవుతుంది. యాంత్రీకరణ (వేరుశెనగ విత్తన గొర్రు) ద్వారా విత్తనం వేయడం వల్ల ఎకరాకు రూ.800 మాత్రమే ఖర్చు అవుతుంది. అంతేకాకుండ ఎకరా భూమిలో విత్తనం నాటడానికి గంట సరిపోతుంది. సమయంతో పాటు ఖర్చు కూడా మిగులుతుంది.

గుంతల రోడ్డుకి మోక్షం

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలంలోని తగువారిపల్లి పంచాయతీ అండారెడ్డిపల్లి గ్రామంలోని జాతీయ రహదారులు గత కొంతకాలంగా రోడ్డుపై మురుగునీరు ప్రవహించి రోడ్డు మొత్తం గుంతలు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దీంతో స్పందించిన ఈకె అభయ ఫౌండేషన్ వారు పారిశుధ్య కార్మికులతో గుంతమయమైన రోడ్డుకు సిమెంట్ కంకరతో గుంతలను పూడ్చివేసి శాశ్వత పరిష్కారం చూపారు. ఫౌండేషన్ అధినేత కళ్యాణ్, ఉపసర్పంచ్ లోకనాథం నాయుడు, మాజీ సింగల్ విండో అధ్యక్షులు హేమచంద్ర నాయుడు, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రికి బెంచీలు వితరణ

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి దాతల సహకారంతో రూ.30వేలు విలువ చేసి ఇనుప బెంచీలు శనివారం అందజేయడం జరిగింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మమత రాణి ఆసుపత్రి ఆవరణలో గర్భిణులు కూర్చొవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయడంతో ప్రజాశక్తి విలేకరి డి.త్యాగరాజులు చొరవ చూపి నాగమణి, శ్రీపురం సీతారామయ్య చారిటబుల్ ట్రస్టు, వాసవి మహిళా మండలి వారి సహకారంతో రూ.30వేలు విలువ చేసే బెంచీలను ఆసుపత్రికి అందజేయడం జరిగింది. ఈసందర్భంగా ఆసుపత్రి సిబ్బంది దాతలను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

వేలాడుతున్న విద్యుత్ వైర్లు

పట్టించుకోని విద్యుత్ శాఖ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల బజారు వీధిలోని ఓ విద్యుత్ స్తంభం నుంచి మరో విద్యుత్ స్తంభానికి ఉన్న విద్యుత్ శాఖ వైరు రెండు రోజులుగా వేలాడుతూ బస్సు, లారీ ఇతర భారీ వాహనాలకు తగిలే విధంగా ఉన్నాయి. వేలాడుతున్న వైర్లు విద్యుత్తు ప్రసరిస్తూ ఉంది. భారీ వాహనాలు వెళుతున్నప్పుడు పొరపాటుగా వాహనాలకు వైరు తగిలితే విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అంతేకాకుండా భారీ వాహనానికి వైరు తగులుకొని లాగితే రెండు విద్యుత్ స్తంభాలు కూడా విరిగిపోయి మిగిలిన విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లు కూడా వాహనం మీద పడితే పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉంది. మండల కేంద్రంలో ఈ విధంగా ఉన్న విద్యుత్‌శాఖ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాజీ సిఎంను కలిసిన సర్పంచ్ భాస్కర్



ప్రజాశక్తి- గుడిపల్లి: మండలంలోని కనమనపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ భాస్కర్ శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈసందర్భంగా మండలంలో వైసిపి సిత్థిగతులను వివరించారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని, గతంలోలాగే ప్రస్తుతం పార్టీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు కలిసి పనిచేయాలని జగన్ సూచించారు. వారి వెంట ఎమ్మెల్సీ భరత్ కూడా ఉన్నారు.

ఇంకుడు గుంతల పరిశీలన

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరునత్తం గ్రామంలోని సుబ్రహ్మణం ఫామ్ పాండ్, బంగాళాదుపం పంటలను జిల్లా ఉద్యానశాఖ అధికారి డాక్టర్ డి.మధుసూదన్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నీటి కొరతను అధిగమించడానికి పొలంలో ఫామ్ పాండ్ నిర్మాణాన్ని చేపట్టినట్లయితే ఉద్యానశాఖ ద్వారా రూ.75వేలు వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. అలాగే తీగజాతి కూరగాయలు సాగుచేసే రైతులు 10 అడుగుల రాతికూసాలతో పందిరి ఏర్పాటు చేసుకున్నట్లయితే ఉద్యానశాఖ ద్వారా ఎకరాకు రూ.లక్ష వరకు రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయండి

ఎంపీడివో చంద్రమౌళి

ప్రజాశక్తి- కార్వేటినగరం: పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయలని ఎంపీడీవో చంద్రమౌళి పిలుపునిచ్చారు. శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ఐసిడిఎస్‌లో పనిచేస్తున్న టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ చంద్రమౌళి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో టీచర్లు చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ వారి పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం ద్వారా అందించే ప్రతి సదుపాయాలు చిన్నరులకు కచ్చితంగా అందించాలన్నారు. అనంతరం ఎంఈఓ విజయ్ కుమార్, మనోజ్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రంలో ప్రతి చిన్నారికి భవిష్యత్తుకు పునాది వేసే తొలి అడుగన్నారు. ప్రతి చిన్నారి స్థాయి పట్ల అవగాహనతో వివిధ రకాల ఆట వస్తువులతో, కథలతో తెలుగు ఆంగ్ల పదాలను పరిచయం చేయాలన్నారు. విద్యపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పిలుపునిచ్చారు. సిఐ హనుమంతప్ప మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు పట్ల పిల్లలకు గ్రామప్రజలకు జరుగుతున్న అగత్యాలను ఎలా ఎదుర్కోవాలని వివరించారు. ఐసిడిఎస్ సిడిపిఓ పద్మ సునంద మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం అందేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రిసర్స్ పర్సన్లుగా చెంగల్‌రాజు, రా బార్టు, నరేష్, హెచ్ఎం కోటేశ్వరరావు, సూపర్వైజర్లు ఇందిర, శ్యామిని, సిఆర్పిలు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 22 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్ డిఆర్‌డిఏ సంయుక్తంగా శనివారం స్థానిక చిత్తూరు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిలుగా చిత్తూరు డిఆర్‌డిఏ పీడీ విజయ్ కుమార్, చిత్తూరు అదనపు జిల్లా నైపుణ్యాభివృది అధికారి ఏకాంబరం రెడ్డి, ఎంప్లాయిమెంట్ సిబ్బంది లోకేశ్వరి పాల్గొన్నారు. జాబ్ మేళాలో 4 బహుళ జాతీయ కంపెనీల పాల్గొన్నాయి. ఈ జాబ్ మేళాలో సుమారు 41 మంది హాజరు కాగా వారిలో 22 మంది ఉద్యోగావకాశాలు పొందారు.

క్రీడాకారుల అభివృద్ధికి సహకారం

ఫెడ్‌లైట్స్ ప్రారంభించిన జెడ్‌పి మాజీ ఛైర్మన్ కుమార్ రాజా

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఇకపై ఫెడ్‌లైట్స్ వెలుతురులో క్రీడాకారులు వాలీబాల్ ఆడవచ్చు అని జడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈకెఎఎఫ్ ఆధ్వర్యంలో వాలీబాల్ క్రీడాకారుల కోసం ఫెడ్‌లైట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బంగారుపాళ్యం నుంచి వాలీబాల్ జాతీయస్థాయి క్రీడాకారులుగా క్రీడాకారులు ఎదిగారని అన్నారు. ఉన్న అరకొర వసతులతోనే క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదిగారని, ఇకపై అన్ని వసతులతో క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్ బాల్ కార్యదర్శి సురేష్, మండల టిడిపి అధ్యక్షులు జయప్రకాష్ నాయుడు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు తులసి రెడ్డి కుమార్, క్రీడాకారులు సుదర్శనం నాయుడు, మురారి, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమపేరుతో వంచన..

వీఆర్‌ఓకు దేహశుద్ధి..!

ప్రజాశక్తి - రామకుప్పం: తనతో పాటు వీఆర్వోగా పనిచేస్తున్న ఓ యువతిని ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఓ వీఆర్వో పెళ్లి విషయం దాట వేసేలా ప్రవర్తించడంతో మహిళా వీఆర్వో కుటుంబీకులు అతనికి దేహశుద్ధి చేసిన సంఘటన రామకుప్పంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈసంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా.. కడప జిల్లాకు చెందిన శ్రవణ్ అనే వ్యక్తి రామకుప్పం మండలం, కొంగనపల్లి వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నాడు. రామకుప్పం మండలానికి చెందిన ఓ యువతి బందార్లపల్లి సచివాలయం వీఆర్వోగా విధులు నిర్వహిస్తోంది. వీరిద్దరి మధ్య పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఈనేపథ్యంలో తనను వివాహం చేసుకోవాలని మహిళా వీఆర్వో శ్రావణ్‌ను కోరుతూ వస్తోంది. అయితే గత రెండేళ్లుగా అతను పెళ్లి విషయంలో స్పష్టత ఇవ్వకపోగా డొంక తిరుగుడుగా మాట్లాడడం మొదలుపెట్టాడని తెలిపారు. ఈ క్రమంలో యువతి బంధువులు ఈ విషయంగా తహశీల్దర్ కార్యాలయం వద్దకు చేరుకొని శ్రావణ్‌ను నిలదీసారు. అతను సరైన సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన మహిళా వీఆర్వో బంధువులు అతనికి దేహశుద్ధి చేసి,100కు సమాచారం అందించడంతో పోలీసులు విచారిస్తున్నారు.

'రైతులు పంటలకు బీమా చేసుకోండి'

ప్రజాశక్తి- శాంతిపురం: మండలంలోని రైతులు రబి సీజన్‌కు సంబంధించిన పంటలకు పసల్ బీమా యోజన పథకం, పంట ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి.అప్పోజి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు సాగు చేసే వరి, వేరుశనగ దిగుబడి ఆధారిత పంటల బీమా, టమోట, మామిడికి వాతావరణ ఆధారిత పంట బీమా ఉందన్నారు. పంట రుణాలు తీసుకొని రైతులు వరి పంటకు ఎకరాకు రూ.630లు, వేరుశనగకు ఎకరాకు రూ.480లు, టమోటా పంటకు ఎకరాకు రూ.1600లు ప్రీమియంను చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులకు వేరుశనగ పంటకు ఎకరాకు రూ.30 వేలు, వరి పంటకు ఎకరాకు రూ.42 వేలు కవరేజ్ అవుతుందని తెలిపారు. రైతులు పూర్తి వివరాలకు రైతు సేవా కేంద్రాల అధికారులను, మండల వ్యవసాయ అధికారులను సంప్రదించవచ్చున్నారు.

సమర్ధవంతంగా సర్వేలు

డిఎం అండ్ హెచ్‌ఒ ప్రభావతిదేవి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లాలోని వైద్యాధికారులతో డిఎం అండ్ హెచ్ఓ డాక్టర ఓ ప్రభావతి దేవి శనివారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సైరిక్, వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని పిహెచ్‌సి వైద్యులు, బయో మెడికల్ ఎక్విప్మెంట రిపేర్స్ వెంటనే చేయించుకోవాలని, పిహెచ్‌సిలోగల ఎలక్ట్రానిక్ పరికరాలు మరమ్మతులకు గురైతే సైరిక్ వారిని సంప్రదించి మరమ్మతులు చేయించుకోవాలని తెలిపారు. ఇప్పటికే చేయని పక్షంలో డిఎంఅండ్ హెచ్‌కి తెలియజేయాలని కోరారు. 5 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు బూస్టర్, వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వాలని, ప్రస్తుతం క్యాన్సర్ స్క్రీనింగ్, స్కూల్ హెల్త్ స్క్రీనింగ్, సాన్స్ (నిమోనియా స్క్రీనింగ్) ఆర్‌బిఎస్‌కె స్క్రీనింగ్ వివిధ రకాల సర్వేలు జరుగుతున్నాయని ప్రతి కార్యక్రమాన్ని నాణ్యతగా నిర్వహించాలన్నారు. ప్రతి వైద్యాధికారి కచ్చితత్వంతో మానిటర్ చేయాలని తెలిపారు. అలాగే ఐసిడిఎస్ హెల్త్ డిపార్ట్మెంట్ కన్వర్జెన్స్‌తో ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని రకాల టీకాల సేవలను పూర్తిచేసి యూవిన్ యాప్‌లో వంద శాతం అప్డేట్ చేయాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు ఏపీ ఎన్జీజీఓ సంఘం, పలమనేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక ఎన్‌జిఓ హోంలో 24వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు డాక్టర్ అగర్వాల్ కంటి క్లీనిక్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షులు ఆనందనబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నియోజక వర్గ ప్రజలు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, పిపిఎస్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సమితి అధ్యక్షులు సుబ్రమణ్యం పిళ్లై, కార్యదర్శులు జయమ్మ, నరసింహులు తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి- వెదురుకుప్పం: కార్వేటినగరం మండలం ఆర్‌కెవిబిపేట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త సుబ్రహ్మణ్యం శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం అన్నారెడ్డి రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. వారి వెంట అన్నారెడ్డి హేమంత్ కుమార్ రెడ్డి, సతీష్ రెడ్డి, ఢిలీబాబు రెడ్డి ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

ప్రజాశక్తి- గంగవరం: స్థానిక మదర్ థెరిసా విద్యాసంస్థలు ఎంసీఏ విభాగం మహిళా విద్యార్థులకు మహిళా సాధికారత, మహిళా సంరక్షణ అంశంపై ఒక్కరోజు అవగాహన సదస్సు నిర్వహించినట్లు రెస్పాండెంట్ రవీంద్రబాబు తెలియజేశారు. ఈ కార్యక్రమం కుప్పం సెమినైన్ కంపెనీ సీఈవో అనంత ఆధ్వర్యంలో జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సహనం కోల్పోకుండా చదువుపై ఆసక్తి చూపి సమాజం పట్ల గౌరవాన్ని పెంచుకోవాలన్నారు. మహిళల హక్కులు, బాధ్యతలను గురించి వివరించారు. అకాడమీ అధికారి రాజేందర్ రెడ్డి, ఛైర్మన్ సునీల్ బాబు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ జాతీయ కాపు సంఘం సెంట్రల్

ప్రచార కమిటీ కన్వీనర్‌గా హరికుమార్



ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: ఆంధ్రప్రదేశ్ జాతీయ కాపు సంఘం సెంట్రల్ ప్రచార కమిటీ కన్వీనర్‌గా డిఎం.హరి కుమార్‌ను నియమిస్తూ జాతీయ కాపు సంఘం కార్యాలయంలో శనివారం జాతీయ కాపు సంఘం వ్యవస్థాపకులు, అధ్యక్షులు కర్ణ మురళీకృష్ణ నాయుడు నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా హరికుమార్ మాట్లాడుతూ తప్పై నమ్మకంతో తనకిచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

వీఆర్ఏల సంఘం ఎన్నిక

ప్రజాశక్తి - రొంపిచెర్ల: విఆర్ఏల సంఘం రాష్ట్ర రెవెన్యూ అసోసియేషన్ కొత్త కమిటీని శనివారం ఎన్నుకోవడం జరిగింది. చిత్తూరు జిల్లా విఆర్ఏల సంఘానికి రొంపిచెర్ల నుంచి అధ్యక్షులుగా వై.లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఇర్ఫాన్ అలీని ఎన్నుకున్నారు. వీరి ఎంపిక పట్ల మండలం రెవెన్యూ అసోసియేషన్, వీఆర్ఏ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వీరికి పలువురు అభినందనలు తెలియజేశారు.

పేడ దిబ్బల తొలగింపు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవిబి పేట పంచాయతీలోని కలికిరి ఇండ్లు, ఇంద్రకాలనీ రాజులు కండిగ గ్రామాలలో శనివారం పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా పేడదెబ్బలను గ్రామానికి దూరంగా ఉండేలా కార్యదర్శి గోపి చర్యలు చేపట్టారు. అనంతరం ప్రజలకు పరిశ్రమపై అవగాహన కల్పించి, వ్యాధులకు దూరంగా ఉండేలా చూడాలన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయరాదని సూచించారు. శనివారం ఎంపిడివో టి.చంద్రమౌళి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో పేర్కొన్నారు.

డిఆర్‌డి క్లినిక్ ప్రారంభం

అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్యం: డాక్టర్ సురేష్ బాబు

ప్రజాశక్తి- శాంతిపురం

తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా డిఆర్‌డి క్లినిక్‌ను ప్రారంభించినట్లు డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. మండల కేంద్రమైన శాంతిపురంలో శనివారం నూతన క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, కడుపు నొప్పి, షుగర్ పరీక్షలు, సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స, నెలసరి సమస్యలు, ఐయుఐ, సాధారణ కాన్పులు, నొప్పి లేని కాన్పులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు, చిన్నపిల్లలకు సంబంధించిన అన్ని కేసులకు చూడబడునని తెలిపారు. అంతేకాకుండా ల్యాబ్, గర్భిణీలకు సంబంధించిన అన్ని స్కాన్లు, ఫార్మసీ సౌకర్యం ఉందని చెప్పారు. ఈ క్లినిక్ ప్రారంభోత్సవం సందర్భంగా డిఆర్‌డి క్లినిక్ వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంకు 250 మంది పైగా వచ్చారని తెలిపారు. డాక్టర్లు హరిత, భవాని, హేమంత్ నాయుడు, దిలీప్ కుమార్‌రెడ్డి రోగులకు వైద్యసేవలు అందించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, జడ్పిటిసి శ్రీనివాసులు, మాజీ రెస్కో ఛైర్మన్ చక్రపాణి రెడ్డి, ఎక్స్ ఎంపీపీలు వెంకటేష్, పుష్ప, మాజీ జెడ్పిటిసి శకుంతల మురళీమోహన్ రెడ్డి, విజయ్‌కుమార్, వెంకటాద్రి నాయుడు, విజయరామిరెడ్డి ఉయ్యాల జయరాం రెడ్డి, అనసూయ, ఎస్.శ్యామరాజు, నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరాలు అదుపు చేయడానికే స్మార్ట్ లాక్స్: సిఐ

ప్రజాశక్తి - కార్వేటినగరం: దొంగతనాలకు చెక్ పెట్టేందుకు, నేరాలను అదుపు చేయడానికే స్మార్ట్ లాక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సిఐ హనుమంతప్ప తెలిపారు. శనివారం సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐ మాట్లాడారు. నేరాలను అదుపు చేయడానికి జిల్లా ఎస్పీ మణికంఠ చందో ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ రాజ్‌కుమార్ 300 స్మార్ట్ లాక్స్‌ను రంగంలోకి తీసుకొచ్చారన్నారు. గతంలో నేరాలను అరికట్టేందుకు సీసీ కెమారాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రస్తుతం మరింత టెక్నాలజీని ఉపయోగించి స్మార్ట్ లాక్స్‌లను తీసుకురావడం జరిగిందన్నారు. ఆలయాలు, చర్చిలు, మసీదులు, బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ముఖ్యమైన షాపులు, వీళ్లకు ఏర్పాటు చేయడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చన్నారు. దొంగలు తాళాన్ని తాకిన వెంటనే అలారం మోగడం ప్రారంభమవుతుందని దీంతో స్థానికులు అప్రమత్తమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీనిపై మహిళా పోలీసుల ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించడం జరుగుతుందని, ప్రతి ఈ స్మార్ట్ లాక్లను సద్వినియోగం చేసుకుని నేరాల నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ లాక్ విలువ రూ.400లు మాత్రమేనని అవసరమైన వారు ఎస్ఐని సంప్రదించాలని సూచించారు.

విలేకర్ల సమావేశంలో డెమో చూపిస్తున్న సిఐ హనుమంతప్ప

న్యాయం చేయండి..

ప్రజాశక్తి- కుప్పం టౌన్: వారి తాత పేరు మీద ఉన్న భూమిని కొంతమంది అక్రమంగా ఆక్రమించుకున్నారని, ఈ విషయంపై ప్రభుత్వ అధికారులను ఆశ్రయించినా తమకు న్యాయం జరగలేదంటూ కుప్పం పట్టణం గెరిసిబావి ప్రాంతానికి చెందిన కస్తూరి ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె తెలిపిన మేరకు పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గెరిసిబావి ప్రాంతంలో కస్తూరి తాత పేరుపై 87/2డి సర్వే నెంబర్‌లో 50 సెంట్ల భూమి ఉందన్నారు. ఈ భూమి నేటికీ రెవెన్యూ రికార్డులలో వారి తాతల పేరు మీదే ఉందని, కానీ భూమిని మాత్రం తమ గ్రామానికి చెందిన కొంతమంది అక్రమంగా ఆక్రమించుకొని అనుభవిస్తున్నారని ఆరోపించారు. అంతేకాక ఆక్రమణదారులు దౌర్జన్యంగా తమ భూమిలో నిర్మాణాలు సైతం పూర్తి చేసినట్టు తెలిపారు. తమకు ఆ భూమి తప్ప వేరే ఆస్తి లేదని, కనీసం ఉండటానికి ఇల్లు లేని పరిస్థితులలో జీవనం సాగిస్తున్నామని, అలాంటి పేదవర్గానికి చెందిన తమపై దయచూపి, తమకు న్యాయం చేయాలని, రెవెన్యూ అధికారులను, పోలీసులను, జిల్లా కలెక్టర్‌ను సైతం కలిసి వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈ విషయమై స్పందించిన కలెక్టర్ సామరస్యంగా సమస్యను పరిష్కరిస్తూ, తమ తాత పేరు పై ఉన్న 50 సెంట్లలో ఆక్రమణదారులు ఇల్లు కట్టుకోవడం చేత వారికి పది సెంట్లు భూమి వదిలిపెట్టి, మిగిలిన 40సెంట్లు భూమిని భూయజమాని వారసులు అయిన తమను అనుభవించుకోవాల్సిందిగా తెలియజేశారన్నారు. వారి ఆదేశాల మేరకు భూమిని స్వాధీన పరచుకోవడానికి వెళ్లగా ఆక్రమణదారులు తమపై దాడికి దిగుతున్నారని, ఈ విషయాలన్నింటినీ తెలియపరుస్తూ కుప్పం రెవెన్యూ డివిజన్ అధికారికి, పోలీసు వారికి ఫిర్యాదు చేశామన్నారు. అయినా తమకు న్యాయం జరగలేదని దీంతో మీడియాను ఆశ్రయించామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

భక్తులను అలరించిన 'భక్తి రంజని'

ప్రజాశక్తి- ఐరాల: విజయవాడ కనకదుర్గమ్మ ఆస్థాన మండపంలో దేవస్థానం వారు ఏర్పాటుచేసిన భక్తి రంజని కార్యక్రమం మన సంస్కృతి కళాసంస్థ వారి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి పాటలు, బృంద గానాలతో గాయకులు భక్తులను అలరించడం జరిగింది. ఈ భక్తిపాటల కార్యక్రమంలో గుట్టకిందపల్లి, 35 ఎర్లం పల్లె పంచాయితీ, ఐరాల మండలంలోని ప్రముఖ గాయకుడు, శ్రీదేవి కళావేదిక వ్యవస్థాపకులు జీను రాజశేఖర్ పాల్గొని తన మాధుర్యంతో భక్తిపాటలు ఆలపించి భక్తులను అలరింపచేశారు. ఆలయ ధర్మకర్తల మండలి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రతన్‌రాజు జీను రాజశేఖర్‌కి ప్రశంసాపత్రం, అమ్మవారి ప్రసాదాలు కండువా కప్పి సన్మానించడం జరిగినది.

ఆలయ అభివృద్ధికి సహకరించండి..

ప్రజాశక్తి- కుప్పం టౌన్: కుప్పం పట్టణంలోని ఆదిమునేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సహకరించాలని పట్టణ పరిధిలోని కుమ్మరి శాలివాహన కులస్తులు పత్రికాముఖంగా కోరారు. వారు మాట్లాడుతూ పలమనేరు క్రిష్ణగిరి జాతీయ రహదారికి పక్కన కందన్న వుడయార్ గార్డెన్‌లో వెలసిన ఆది మునేశ్వరస్వామి దేవాలయం మౌలిక సదుపాయాలు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మున్సిపల్ అధికారులు ఆలయానికి అవసరమైన సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఆకతాయిలు రాత్రిపూట ఆలయం వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని పోలీసు అధికారులు ప్రత్యేకదృష్టి సారించి వాటిని నివారించాలని కోరారు.

మరుగుదొడ్ల వినియోగంపై ర్యాలీ

ప్రజాశక్తి- గంగవరం: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని పీలపట్ల ఉన్నతపాఠశాల విద్యార్థులు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాఠశాల నుంచి సచివాలయం కూడలి వరకు నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి మానవహారం నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఐఇసి జిల్లా కన్సల్టెంట్ శాంతి, ఎంపిడిఓ కె.సురేష్ బాబు, గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ లక్ష్మీసుధా, ప్రధానోపాధ్యాయులు దామోదర్, పంచాయతీ కార్యదర్శి హేమలత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థులు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వచించారు. పాఠశాల నుంచి స్థానిక నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఐఈసి జిల్లా కన్సల్టెంట్ శాంతి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఏ ఈ లోకనాథం, ప్రధానోపాధ్యారాలు సుల్తానా, తోయజాక్షి, మండల కో ఆర్డినేటర్ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి సదాశివయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతంతమాత్రంగానే పారిశుధ్యం

ప్రజాశక్తి- చిత్తూరు టౌన్

చిత్తూరు నగరపాలక సంస్థ నగరాన్ని శుభ్రపరచడం అంతంత మాత్రంగానే ఉంది. నగరంలో సేకరించిన చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల, చెత్త లారీల ద్వారా డంపింగ్ యార్డుకు సిబ్బంది తరలిస్తుంటారు. చెత్త తరలించే ట్రాక్టర్ల పైన లారీల పైన ఎలాంటి పట్టా కప్పకపోవడంతో అవి వెళ్లే వేగానికి గాలికి చెత్తాచెదారం అంతా రోడ్డు మీద చల్లా చదరగా పడుతున్నాయి. అంతే కాకుండా వెనుక నుండి వచ్చే వాహనదారుల పైన ఈ చెత్తాచెదారం పడుతుండగా కొందరికైతే కళ్ళలోకి దుమ్ము దూళిపడంటంతో వెంటనే వాహనాలు ఆపడం వలన వెనుకవైపు నుంచి మరో వాహనం ఢీకొని పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్మికులు సేకరించిన చెత్తను రోడ్ల పైన పడకుండా గాలికి ఎగరకుండా వాహనాల పై పట్టను కప్పి శుభ్రంగా తీసుకొని డంపింగ్ యార్డ్‌కి తరలించాలని చిత్తూరు నగరవాసులు కోరుతున్నారు.

మహారాజశ్రీ ఒంగోలు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

HMOP No : 92/2024

Between

రాయపాటి సరిత ..... పిటిషనర్

మరియు

సోమవరపు రాజేష్ బాబు ... రెస్పాండెంట్

To

సోమపురం రాజేష్ బాబు, తండ్రి K.చంద్రశేఖర్ నాయుడు వయస్సు 43 సంవత్సరాలు
R/o డోర్ నెంబర్:21-371, షుగర్ ఫ్యాక్టరీ వెనుక, డి.వెంగన్నపల్లె, చిత్తూరు మండలం, చిత్తూరు జిల్లా.

పై నెంబర్ పిటిషన్ లో కోర్టు వారు నీకు నోటీసులు పంపగా నీవు తీసుకొనక కాలయాపన చేయుచున్నావు కావున కోర్టు వారు నీకు నోటీసు నిమిత్తం తేదీ : 23-12-2024కి వాయిదా వేసి యున్నారు ఆ రోజు ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టులో నీవు స్వయంగా గాని లేదా నీ ఏజెంట్ ద్వారా గానీ పై కోర్టు వారి ఎదుట హాజరై సంజాయిషీ తెలుపుకొనవలెను లేనియెడల కోర్టు వారు కేసు నీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పెళ్లూరి రామకృష్ణ
అడ్వకేట్, ఒంగోలు
ప్రకాశం జిల్లా.